క్లుప్తంగా...

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆయాచితం శ్రీధర్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేనుశ్రీ రచించిన భైరవశతకం పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. సమకాలీన అంశాలపై రచయిత రాసిన పద్యం బాగుందని కొనియాడారు. పద్యం అంటే తనకు ఎంతో ఇష్టమని, వందల సంవత్సరాలుగా పద్య ప్రభావం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిద్దారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం


నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను అభినందిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

అబిడ్స్: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను ఆయన సోమవారం సత్కరించి అభినందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ చిత్తుగా ఓడిపోతుందన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలను గడపగడపకూ అందించి బీఆర్‌ఎస్ విజయం సాధించే విధంగా కృషి చేస్తామన్నారు.

క్రికెట్ బెట్టింగ్, సట్టా నిర్వహిస్తున్న 9 మంది అరెస్టు

అబిడ్స్: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సట్టా, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న తొమ్మిది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి సుమారు లక్ష రూపాయాల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ అజయ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిందితుల వివరాలను వెల్లడించారు. మంగళ్‌హాట్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా ధూల్‌పేటకు చెందిన మహేష్ సింగ్(32), దుర్గేష్ సింగ్ (21) సట్టా నిర్వాహకులు, గంగాబౌలికి చెందిన మహేష్ సింగ్(48) ఆటోడ్రైవర్, హమీద్ బిరాదర్ (40) వ్యాపారి, శికుమార్ (38) సట్టా ఆర్గనైజర్, మంగళ్‌హాట్‌కు చెందిన సందీప్ సింగ్ (30) సట్టా ఆర్గనైజర్, మంగళ్‌హాట్‌కు చెందిన సునీల్ కుమార్ (38) సట్టా ఆర్గనైజర్ వీరంతా గత కొంతకాలంగా పుంటర్స్‌తో నేరుగా లావాదేవీలు జరుపుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి


జలమండలి జీఎంతో మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని మార్కండేయనగర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీనిని వెంటనే పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన బీజేపీ నాయకులతో గుడిమల్కాపూర్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ నాగేందర్‌ను కలిశారు. మార్కండేయనగర్‌లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్డుపై పారుతుందని, పాదచారులు నడవడానికి ఇబ్బందులుపడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీటి సరఫరా సవ్యంగా లేదని, నల్లాలలో వచ్చే నీరు తాగునీటి అవసరాలకు సైతం సరిపోవడం లేదన్నారు. స్పందించిన జనరల్ మేనేజర్ సంబంధిత ఏరియా అధికారులను పంపి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, అనీల్‌కుమార్, నామా యాదగిరి తదితరులున్నారు.

కుతుబ్‌షాహీ నాటి మసీదులు..
నాటి నిర్మాణశైలికి చిహ్నాలు

- నేటికీ చెక్కుచెదరని పురాతన మసీదులు
- మత సామరస్యానికి ప్రతీకగా..
- ప్రతి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు


గోల్కొండ కోట ఎదురుగా ఉన్న కుతుబ్‌షాహీ జామా మసీదు


మోతీమహల్‌లోని అతి ప్రాచీన మసీదు

గోల్కొండ: శతాబ్దాల చరిత్రగల మసీదులు నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో 400 ఏళ్ల క్రితం నిర్మించిన మసీదులు ఎన్నో ఉన్నాయి. వీటిలో మొదటి కులీకుతుబ్‌షాహీ రాజు నిర్మించిన మసీదులు ఎన్నో ఉన్నాయి. తాను స్వయంగా నిర్మించిన మసీదులో సుల్తాన్ కులీ వాటిలోనే నమాజ్ ఆచరించేవారు. ప్రత్యేక ఇండో పరిషియన్ శైలీలో నిర్మించిన ఆ మసీదులు ఆ నాటి నిర్మాణ శైలికి అద్దం పడుతున్నాయి. ఆ నాటి మసీదులలో గోల్కొండ కోట ఎదురుగాగల కుతుబ్‌షాహీ జామా మసీదు, మోతీమహల్ మసీ దు, మోతీ దర్వాజ వద్ద గల మోతీ మసీదు ప్రధానమైనవి ఇవే కాకుండా కటోరహౌస్ వద్ద గల నీమ్ బౌలి మసీదు, సెవెన్‌టూంబ్స్‌లో గల కుతుబ్‌షాహీ మసీదు ముఖ్యమైనవి. ఈ మసీదులు సామాన్య ప్రజలతో పాటు సైనికులు, కుతుబ్‌షాహీ రాజ కుటుంబీకుల కోసం ప్రత్యేకంగా నిర్మించబడ్డాయి. వర్తకుల కోసం కుతుబ్‌షాహీ రాజుల కాలంలో గోల్కొండకు వచ్చే విదేశీ వర్తకుల కోసం నిర్మించబడ్డాయి. కోట ద్వార పాలకులు, ప్రహరీకి కాపల కాసే సైనికుల కోసం నిర్మించిన మసీదులు కూడా ఉన్నాయి.

ఖాళీ స్థలంలో అదనపు గదులు..

అయితే ఈ మసీదులన్నీ నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఈ మసీదుల నిర్మాణ కమిటీ వారు, మసీదులకు ఓ వైపు పరిరక్షిస్తూనే మరో వైపు ఖాళీ స్థలంలో అదనంగా ప్రార్థనల కోసం గదులు నిర్మించారు. కొన్ని మసీదులకు వాటి నిర్వాహకులు పాత కాలం నాటి నిర్మాణానికి ఎటువంటి భంగం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఈ మసీదుల్లో రంజాన్ మాసంలో తరావి ప్రార్థనలు జరుగుతుంటాయి. అంతేకాకుండా ప్రతి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు కూడా జరుగుతుంటాయి. ఈ మసీదులలో ప్రార్థనల కోసం వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ మసీదులలో కొన్నింటిలో నేటికి కూడా కుతుబ్‌షాహీ రాజులు తవ్వించిన బావులు ఉండడం విశేషం.

ప్రాచీన మసీదుల పరిరక్షణకు కృషి..



కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి మసీదుల పరిరక్షణకు అందరి సహాయ సహకారాలు తీసుకుంటున్నాం. మసీదుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గులాం మొయినుద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ అధికారుల సహకారం కూడా తీసుకుంటున్నాం.

– షకీల్ అలీఖాన్, గోల్కొండ

ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు 33 బహుమతులు


అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మోహీద్దీన్

సంతోష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ 7వ గార్డెన్ ఫెస్టివల్, 1వ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్–2023లో భాగంగా వివిధ హరిత కార్యక్రమాల కింద ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌అండ్‌డీ) హైదరాబాద్ మొత్తంగా 33 బహుమతులకు ఎంపికైంది. వీటిలో 17 ప్రథమ బహుమతులు, 16 ద్వితీయ బహుమతులు ఉన్నాయి. ఈ ప్రక్రియను 2023 జనవరి 10 నుంచి 20 వరకు తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంత పెద్ద మొత్తంలో అవార్డులు రావడం మా సంస్థకి ముఖ్యంగా డీఆర్‌డీఓకి చాలా గర్వకారణమని చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మోహీద్దీన్ అన్నారు. ఆర్బోరికల్చర్ బృందం సభ్యుల శ్రమ, కృషి, పట్టుదల ఈ అవార్డులు రావడానికి ముఖ్య కారణమన్నారు. అందనంగా డిఫెన్స్ విభాగంలో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ హైదరాబాద్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు కూడా లభించింది. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం పబ్లిక్ గార్డెన్‌లోని సెంట్రల్ లాన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి నిరంజన్‌రెడ్డి, గౌరవ అతిథిగా తెలంగాణ రైతు బంధు సమితి చైర్మన్, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మోహీద్దీన్ హాజరయ్యారు.

మహనీయుల నుంచి స్ఫూర్తిని పొందాలి

గన్‌ఫౌండ్రీ: మహనీయుల జయంతిని జరుపుకోవడం నేటి యువతరం, పరిశోధక విద్యార్థులకు ఎంతో ఆవశ్యకత కలిగిన అంశమని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు అన్నారు. సోమవారం నిజాం కళాశాలలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహనీయుల నుంచి నేటి యువతరం స్ఫూర్తిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఓటా ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మల్లేశం, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


మహనీయుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ రాములు తదితరులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఫణి పవన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం రవీంద్రభారతిలో ఈ–అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాంత బయోటెక్ అధినేత పద్మశ్రీ కేఐ.వరప్రసాద్‌రెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. ఈ–అభ్యాస్ నిర్వహించిన పరీక్షలు, శిక్షణా తరగతులు విద్యార్థులలో పోటీతత్వం పెంపొందించడంతో పాటు రాబోయే రోజుల్లో వివిధ పరీక్షలలో విజయం సాధించడానికి దోహదపడుతాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంస్థ చైర్మన్ డాక్టర్ ఫణి పవన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ శాసనం ఉన్న ప్రాంత అభివృద్ధికి కృషి


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: తొలి తెలంగాణ శాసనం ఉన్న ప్రాంతాన్ని పర్యాటకరంగ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రతినిధులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలంలోని తెల్లాపూర్ గ్రామం తొలి తెలంగాణ శిలా శాసనం ఉన్న గ్రామమని గుర్తు చేశారు. ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ గ్రామంలో ఉన్న శాసనాలను గుర్తించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని పురావస్తుశాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫైనార్ట్స్ యూనివర్సిటీలో షార్ట్‌టైమ్ కోర్సులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని ఫైనార్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో లలిత కళల్లో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, పోటరి, ఫొటోగ్రఫీ, యానిమేషన్, క్యాలీగ్రఫీ కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. మే 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, 93470 48708, 80992 24945లలో సంప్రదించవచ్చన్నారు.

'రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగింది'

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్



గోల్కొండ: బీజేపీ బలమైన శక్తిగా ఎదిగిందని రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో మార్కండేయనగర్ పద్మశ్రీ భవన్‌లో జరిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రోజుకో స్కాం వెలుగు చూస్తున్నా కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. తెలంగాణను లీకేజీల తెలంగాణలో ప్రజలు ఎగతాలి చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలలో బీజేపీ బలీయంగా ఉందని, బీఆర్‌ఎస్‌కు సరైన ప్రత్యామ్నాయం బీజేపీయేనన్నారు. అనంతరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ కుమారుడు దేవర వంశీని సమావేశంలో అందరికీ పరిచయం చేశారు.

కాడిగే పాండయ్యకు సన్మానం


కాడిగే పాండయ్యను సన్మానించిన మంత్రి మహమూద్ అలీ, మిత్రకృష్ణ

జియాగూడ: వివిధ రంగాల్లో 40 ఏళ్లుగా సేవలందిస్తున్న సంఘ సేవకుడు కాడిగే పాండయ్య అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డును అందుకోవడం హర్షణీయమని కార్వాన్ బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యాల భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డు అందుకోవడంతో పాటు కార్వాన్ మార్కండేయ భవన్ ట్రస్టు అధ్యక్షుడిగా, దర్బార్ మైసమ్మ ఆలయ సభ్యుడిగా, అన్నపూర్ణ ఐటీఐ, సంఘ సేవకుడిగా తదితర వాటిలో పాండయ్య సేవలందిస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవి, లావణ్య, ఆటిపాముల మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు

చార్మినార్: చార్మినార్ డివిజన్‌లో సోమవారం అలియాబాద్‌లోని పై షోరూంలో జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ 20 టీం అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఓ సుధాకర్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు, విపత్తులు, వరదలు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పై షోరూం సిబ్బంది, డీఆర్ఎఫ్ సూపర్‌వైజర్ నర్సింగ్, వెంకటేశ్, సూర్య ప్రకాశ్, సంపత్, మోయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ సుధాకర్


గోషామహల్ మాలకుంటలో కూలిన చెట్టు

అకాల వర్షంతో అవస్థలు

అబిడ్స్: అకాల వడగళ్ల వానతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఉదయం నుంచి ఎండ వేడిమితో అవస్థలు పడ్డ ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన అకాల వనగళ్ల వర్షం అందరినీ ఇబ్బందులకు గురిచేసింది. బేగంబజార్, గోషామహల్, ఎంజేమార్కెట్, జాంబాగ్, ఉస్మాన్‌గంజ్, ధూల్‌పేట్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వడగళ్ల వర్షం కురిసింది. గోషామహల్ మాలకుంట ప్రాంతంలో భారీ వర్షంతో ఆటోపై చెట్టు పడిపోయింది. ఆటోలో ఉన్న వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

పలు ప్రాంతాలు అంధకారం..

భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడిమల్కాపూర్ ప్రాంతంలో సాయంత్రం నుంచే కరెంటు సరఫరా నిలిచిపోయింది. రాత్రి 10 గంటలు దాటినా కరెంటు పునరుద్ధరణ కాకపోవడంతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులపై స్థానిక ప్రజలు మండిపడ్డారు. మహేష్‌నగర్ కాలనీలో అంధకారం ఏర్పడింది.

బీ ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


స్వప్న(ఫైల్)

చాంద్రాయణగుట్ట: బీ ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పుగూడ సాయిబాబానగర్‌కు చెందిన విష్ణుకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె స్వప్న(20) గురుకుల్ హాస్టల్‌లో ఉంటూ బోడుప్పల్‌లోని జ్ఞానజ్యోతి కాలేజీ ఆఫ్ ఫార్మసీలో తృతీయ సంవత్సరం చదువుతుంది. ఈనెల 14న ఇంటికి వచ్చిన స్వప్న ఆదివారం రాత్రి వ్యాజ్‌మోల్ అనే హెయిర్ ఆయిల్‌ను తాగింది. 9 గంటల సమయంలో ఛాతిలో నొప్పి మొదలవ్వడంతో కాసేపు కుటుంబసభ్యులు సపర్యాయాలు చేసినప్పటికీ తగ్గలేదు. చివరకు వ్యాజ్‌మోల్ తాగిన విషయాన్ని స్వప్న తెలపడంతో చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3.15గంటలకు మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



అబిడ్స్: నవభారత్ నిర్మాణ్ సంఘ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. జీహెచ్‌ఎంసీ, పారిశుద్ధ్య కార్మికులను సంఘం అధ్యక్షుడు సూరెపల్లి రవికుమార్ సత్కరించి వారి సేవలు కొనియాడారు. సమాజంలో పారిశుద్ధ్య కార్మికులే నిజమైన సమాజ సేవకులని అన్నారు. వారి ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా సమాజ సేవకు, పరిశుభ్రత కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు.

'ఇంటింటికీ సీపీఐ' విజయవంతం చేయండి

రాజేంద్రనగర్: సీపీఐ ఆధ్వర్యంలో మోడీ హటావో దేశ్ కో బచావో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య వెల్లడించారు. ఈ మేరకు పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహిచారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఇంటింటి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏప్రిల్ 20నుంచి మే 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, సయ్యద్ అక్బర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కిషోర్, ఎం.ఏ.రియాజ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కో–కన్వీనర్‌గా జైపాల్‌రెడ్డి

సీపీఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ కోకన్వీనర్‌గా వనంపల్లి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు బాధ్యతగా పని చేస్తానన్నారు.

జేఎన్ఏఎఫ్ఏయూలో అంబేడ్కర్ జయంతి

విజయనగర్‌కాలనీ: పండిత పామరులతో పాటు ఆబాల గోపాలాన్ని ఆకట్టుకునే స్వభావం లలిత కళలకు ఉందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ సీహెచ్. ఖాసీం అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో సోమవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల్లో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవితా దరియానిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడుతూ.. దైనందిన జీవితంలోని అన్ని సమస్యలను, ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయం ఎలా సాధించాలో అంబేడ్కర్ జీవిత చరిత్ర మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనార్ట్స్, ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ గంగాధర్, శ్రీనివాస్, విష్ణువర్ధన్, కోమటిరెడ్డి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రొ. ఖాసీంకు ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న రిజిస్ట్రార్ ప్రొ. సుందర్‌కుమార్ తదితరులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన 153 షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఒక్కరికీ చేకూరేలా చూస్తున్నానన్నారు. ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమంలో భాగంగా తాను కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నానన్నారు. ఈ పర్యటలోనే తాను స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నానన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. స్వయం సహాయక గ్రూపులు, మహిళలు వ్యాపారం చేసుకోవడానికి రుణాలు ఇప్పించడం జరిగిందని ఆయన అన్నారు. అర్హులైన దళిత కుటుంబాలకు తాను అండగా ఉండి వారికి దళితబంధు పథకం లబ్ధిచేకూర్చేందుకు తనవంతు సహాయ సాకారాలు అందించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు


ఇఫ్తార్ వేడుకల్లో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. రంజాన్‌ను పురస్కరిచుకుని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో సబ్‌రిజిస్ట్రేషన్ వల్లభ్‌నగర్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎం. ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల పండగలను స్వయంగా చేపట్టడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ వెంకట్‌రాజేష్, డీఐజీ టింకుజాన్, సుభాషిణి, సైదిరెడ్డి, మధుసుధన్‌రెడ్డి, డీఆర్‌లు రమేష్‌రెడ్డి, డీవీ.ప్రసాద్, స్మితప్రజ్ఞ, రవీందర్‌రావు, ఇతర నాయకులు విక్రమ్‌కుమార్, ఏఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ గౌడ్, రాజు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో..

గోల్కొండ: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు నిలుస్తున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. సోమవారం షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగరానికి రంజాన్ మాసంలో వన్నె తెస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ సుల్తాన్‌ఖాన్‌తో పాటు బృందావన్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులన్నారు.